క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మూసాపేట: చిట్కో ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు చిట్కో అపార్టుమెంట్స్, పరిసర ప్రాంతాల్లో, మధ్యాహ్నం 12 నుంచి 2గంటల వరకు ఇందు అపార్టుమెంట్స్, విల్లాస్‌లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4గంటల వరకు కేపీహెచ్‌బీ 7వ ఫేజులో, సాయంత్రం 4 నుంచి 6గంటల వరకు ఆర్‌టీఏ కార్యాలయం, కేపీహెచ్‌బీ 4వ ఫేజులో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పాపారాయుడునగర్ ఫీడర్ పరిధిలో..

కూకట్‌పల్లి: పాపారాయుడు నగర్ ఫీడర్ పరిధిలోని ఏవీబీ పురం, పాపారాయుడు నగర్, వైష్ణవి నగర్, రామారావు నగర్, ప్రకాష్ నగర్‌లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ బి.శరత్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్‌పీకాలనీ రామకృష్ణనగర్, ప్రగతినగర్, పాపిరెడ్డినగర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

స్పెల్ బీ పోటీలు



స్పెల్ బీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌లోని గీతాంజలి పాఠశాలలో ఇంటర్ స్కూల్ స్పెల్ బీ పోటీలను 1 – 5వ తరగతి విద్యార్థులకు సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో గీతాంజలి విద్యాసంస్థకు చెందిన అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులు పాల్గొన్నారు. సంస్థ చైర్మన్ పి.శ్రీనివాసరావు పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. స్పెల్ బీ పోటీలతో భాష మీద పటుత్వం లభిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైదా, వైస్ ప్రిన్సిపల్ సుధామాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్



నమూనాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శిరీష

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్‌లో శ్రీసాయి విద్యానికేతన్ స్కూల్‌లో సోమవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు ముఖ్యఅతిథిగా పాల్గొని సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను చూసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సత్యనారాయణ, నాయకులు సుశీల్‌కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన



మోతీనగర్: విద్యార్థుల్లో దాగియున్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని షైనింగ్ సీడ్స్ పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌కే షాహిజాన్ పేర్కొన్నారు. పాఠశాలలో రెండు రోజుల నుంచి నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన సోమవారం ముగిసింది. ఈ ప్రదర్శనలో సుమారు 100 స్టాళ్లను నెలకొల్పారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దుర్గా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో రోడ్ల నిర్మాణం చేపడతాం

మోతీనగర్: వివేకానందనగర్‌లోని రెండు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో సోమవారం బస్తీవాసులు కార్పొరేటర్ సబిహా బేగంను కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఈ రోడ్డు సమస్యతో చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. వారి ఇబ్బందులను తెలుసుకొని ఈ రెండు రోడ్డు నిర్మాణానికి కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ వీరారెడ్డి, పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, డివిజన్ యూత్ అధ్యక్షుడు మస్తాన్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, మల్లేష్, యోగిరాజు, రామారావు, గోపి, యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కంటివెలుగుకు విశేష ఆదరణ

- బాలానగర్‌లో ఇప్పటి వరకు 2028మందికి సేవలు
- అందులో 898 మందికి కళ్లద్దాల పంపిణీ
- 398 మందిని శస్త్ర చికిత్సలకు రీఫర్ చేసిన వైద్యులు
- కంటివెలుగు వంద రోజుల కార్యక్రమం



బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని కంటి వెలుగు శిబిరాల్లో నేత్ర పరీక్షలు చేయించుకోవడానికి అన్నివర్గాల ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. బాలానగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 9 కంటి వెలుగు కేంద్రాలు పనిచేస్తున్నాయి. గత నెల 19వ తేదీ నుంచి కంటి వెలుగు ప్రారంభమైంది. వంద రోజుల పాటు జరిగే కంటి వెలుగు శిబిరాల్లో అక్కడికక్కడే అర్హులైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేస్తారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి సిఫార్సులు చేస్తున్నారు. మరికొందరికి మాత్రలు, కంటి చుక్కల మందులు అందజేస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, వేగంగా జరుగుతుండటంతో బాలానగర్‌లోని సిక్కుబస్తీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరానికి ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది.

ఫైసా ఖర్చు లేకుండా కంటి పరీక్షలు

- జనవరి 19న కూకట్‌పల్లి నియోజకవర్గం వ్యాప్తంగా ప్రారంభమైంది. బాలానగర్‌లోని వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 2028 మంది సేవలు పొందారు.
- శిబిరాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా వైద్య ఆరోగ్యశాఖ జీహెచ్‌ఎంసీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి కంటివెలుగు శిబిరాలను సందర్శించారు. ప్రజలతో మాట్లాడుతూ.. వారికి ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తున్నారు. దీంతో పరీక్షలు సాఫీగా జరుగుతున్నాయని తెలిపారు.
- బాలానగర్‌లోని కంటి వెలుగు శిబిరం రోజుకు 100 నుంచి 125 మందికి పరీక్షలు చేస్తున్నారు. అధికారులకు ఇచ్చిన లక్ష్యాలలో ఇప్పటికే 21 శాతం పూర్తి చేశారు.
- సిబ్బంది ఇంటింటికీ తిరిగి కంటి వెలుగు గురించి చెబుతూ కరపత్రాలను అందజేస్తున్నారు. దీంతో కంటి పరీక్షలు చేయించుకోవటానికి ఎక్కువ సంఖ్యలో ప్రజలు వస్తున్నారు.

అందుబాటులో కళ్లద్దాలు, మందులు...

- ఈ కేంద్రం నుంచి 898 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. మరో 152 మందికి అవసరమైన కళ్లద్దాల కోసం నివేదిక అందజేశారు. సుమారు నెల రోజుల్లో వారికి అద్దాలు అందజేయనున్నారు.
- దగ్గర, దూరం రెండు చూపులు సరిగా లేనివారికి కళ్లద్దాలు తెప్పించడానికి ఆర్డర్ చేస్తున్నారు. అదే విధంగా శస్త్ర చికిత్సలు 398 మంది అవసరం కాగా వారిని వివిధ హాస్పటల్స్‌కు రీఫర్ చేశారు.
- వారికి బాలానగర్‌లోని లయన్స్ క్లబ్ హాస్పటల్, సరోజిని దేవి కంటి ఆసుపత్రుల్లో చికిత్సలు చేయనున్నారు. వార్డు కార్యాలయంలో నిర్వహించే కంటి వెలుగు శిబిరంలో 8 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.
- పేద, మధ్య తరగతి ప్రజలకు ధనవంతులు కంటి శిబిరాల్లో కనిపిస్తున్నారు. మంచి సేవలు దొరికితే ప్రజల స్పందన బాగా ఉంటుంది.

కళ్లద్దాలు పెట్టుకుంటే మంచిగా కనిపిస్తుంది



ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తే చాలా డబ్బులు ఖర్చు అవుతాయి. ఇక్కడ కంటి పరీక్షలు ఉచితంతో పాటు కేంద్రం అందుబాటులో ఉంది. కళ్లు మసకగా కనిపిస్తున్నాయి. ఇక్కడ డబ్బులు ఖర్చు కాకుండా సమయం కూడా కలిసి వచ్చింది. డాక్టర్లు ఇచ్చిన కళ్లద్దాలు పెట్టుకుంటే మంచిగా కనిపిస్తుంది.

– లింగమ్మ, బాలానగర్

చక్కని సేవలు అందిస్తున్నారు...



కంటివెలుగు శిబిరాల్లో నాణ్యమైన సేవలు లభిస్తున్నాయి. ఖరీదైన మెషిన్లతో కంటి పరీక్షలు చేస్తున్నారనిమా బస్తీ వారు చెప్పారు. సిబ్బంది కూడా సహకరిస్తున్నారు. మా సందేహాలను చక్కగా నివృత్తి చేస్తున్నారు. ప్రైవేట్ హాస్పటల్‌లో ఉండే సేవలతోనే కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. ఇక్కడ వైద్యులు, సిబ్బంది చక్కని సేవలు అందిస్తున్నారు.

– ప్రేమ్‌నాథ్, బాలానగర్ 13కెపి 02పి

లక్ష్యాలను పూర్తి చేశాం...



ప్రజలకు సేవలు అందించేందుకు మా సిబ్బంది, మేము ఎప్పుడు సిద్ధంగా ఉంటాం. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేశాం. పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. 40ఏళ్ల పై బడిన వారే ఎక్కువగా వస్తున్నారు.

– డాక్టర్ నీరజ్ బండారి

కంటివెలుగు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షల తీరును తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. వెంకటేశ్వరనగర్ కాలనీలో నగర సంఘం కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవితో కలిసి పరిశీలించారు. కంటివెలుగు కేంద్రంలో అందుతున్న సేవలను ప్రజలను అడిగి ఆయన తెలుసుకున్నారు. వైద్యులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు.

- ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కంటి వెలుగు పథకం దేశంలోనే గొప్ప పథకమని అన్నారు. కంటివెలుగు కేంద్రాల్లో 100 రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి కంటి పరీక్షలు చేస్తున్నామన్నారు. సమస్యలు ఉన్న వారికి ఉచిత చికిత్సతో పాటు మందులు, కళ్లద్దాల అందిస్తున్నామని తెలిపారు. కంటివెలుగు కేంద్రంలో ఒక ఆప్టోమెట్రిస్ట్, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు ఏఎన్‌ఎం, ముగ్గురు ఆశా, డీఈవో బృందంలో సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజుకు శుభాకాంక్షలు



తెలంగాణ శాసనమండలి ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజును మూసాపేట మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, బీఆర్‌ఎస్ యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. – మూసాపేట/ఆల్విన్‌కాలనీ

కంటివెలుగు సేవలపై కమిషనర్ శ్వేతా మహంతి ఆరా



రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మహంతితో అధికారులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ ఫోర్త్ ఫేజులోని మల్టీ ఫంక్షన్‌హాల్‌లో జరుగుతున్న కంటివెలుగు కేంద్రాన్ని సోమవారం తెలంగాణ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మహంతి సందర్శించారు. ఈ సందర్భంగా కంటి వెలుగు కార్యక్రమ వివరాలు, ఏర్పాటు చేసిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్, ప్రోగాం ఆఫీసర్ సంధ్యారాణి, డాక్టర్ చందర్, పీఓ ప్రభాకర్, కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఉపాధ్యక్షుడు పిడికిటి గోపాల్ చౌదరి, భవాని, రమ, లత, భారతి, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



రాజుకాలనీ మెయిన్‌రోడ్డులో పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

బాలానగర్: బాలానగర్ డివిజన్ రాజుకాలనీ మెయిన్‌రోడ్డులో బీటీ రోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. గతంలో డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ల కోసం రోడ్లను తవ్వినందున రోడ్డు పనులు నిలిపేశామని గుర్తు చేశారు. బాలానగర్ డివిజన్ అభివృద్ధికై అహర్నిశలు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ రషీద్, వర్కు ఇన్‌స్పెక్టర్ రాములు, బీఆర్‌ఎస్ నాయకులు ఎంఎస్ కుమార్, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ ముదిరాజ్, నాగేందర్‌గౌడ్, రమేష్, సుధాకర్, మహేందర్‌రెడ్డి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో ట్రావెల్స్ బస్సులు దగ్ధం



దగ్ధమైన మూడు ట్రావెల్స్ బస్సులు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు కట్ట కింద పార్కింగ్ చేసి ఉన్న మూడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత దగ్ధమయ్యాయి. ట్రావెల్స్ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం చెరువు కట్ట కింద భారతి ట్రావెల్స్‌కు చెందిన బస్సులు రోజు మాదిరిగా పార్కింగ్ చేశారు. అర్ధరాత్రి దాటిన తరువాత 50 సీట్లకు చెందిన నాన్ ఏసీ బస్, రెండు మినీ 20 సీట్ల బస్సులు అనుమానస్పద స్థితిలో దగ్ధమయ్యాయి. చుట్టు పక్కల వారు చూసి సమాచారం ఇవ్వడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. పక్కనే ఉన్న మరికొన్ని వాహనాలను వెంటనే తొలగించడంతో మరిన్ని బస్సులు అగ్నికి ఆహుతి కాకుండా కాపాడారు. మంటలు అంటుకున్నప్పుడు ఆ ప్రాంతానికి వచ్చే విద్యుత్ వైర్లు కాలిపోవడంతో సీసీ కెమెరాలు కూడా వెంటనే ఆఫ్ అయ్యాయని ట్రావెల్స్ నిర్వాహకులు తెలిపారు. సుమారు రూ.50లక్షల ఆస్తినష్టం జరిగిందన్నారు. తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని కూకట్‌పల్లి పోలీసులు పేర్కొన్నారు.

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్‌కు కృతజ్ఞతలు

కుత్బుల్లాపూర్: అన్ని వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలు సంఘాల నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. వడ్డెర కులస్తులను బీసీ జాబితా నుంచి తొలగించి ఎస్సీ జాబితాలోకి చేర్చాలని అసెంబ్లీ వేదికగా ప్రస్తావించారు.

- ఈ నేపథ్యంలో వడ్డెర సంఘం నేషనల్ ప్రెసిడెంట్ వేముల లక్ష్మణ్ ఆధ్వర్యంలో అదే విధంగా గాగిల్లాపూర్‌కు బస్తీ దవాఖానాను మంజూరు, దివ్యాంగుల సమస్యలతో పాటు అన్ని ఆర్టీసీ సర్వీసులకు ఒకే పాస్ ఇవ్వాలని అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు సత్కరించారు.
- జగద్గిరిగుట్ట కొండపై వెలసిన మల్లికార్జునస్వామి భ్రమరాంబిక, కేతమ్మ ఆలయ 37వ కల్యాణ మహోత్సవ గోడ పత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించగా ఆలయ చైర్మన్ జేకే శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కరోనా లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో సోమవారం మొత్తం 25 మందికి కోవిడ్ పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్టులు వచ్చాయని వైద్యాధికారులు తెలియజేశారు. దుండిగల్ పీహెచ్‌సీ, షాపూర్‌నగర్ యూపీహెచ్‌సీలో సైతం కోవిడ్ పరీక్షలు జరుగుతున్నాయని అన్నారు. కరోనా లక్షణాలు ఉంటే వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

వైభవంగా పోచమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణ వేడుక

16న పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



పోచమ్మతల్లి ఆలయంలో జరిగిన పూజలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కమిటీ సభ్యులు, భక్తులు





శోభాయాత్రలో కోలాటం



మజ్జిగ అందిస్తున్న ముస్లింలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని నల్ల చెరువు వద్ద ఉన్న పోచమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ వేడుక సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన శోభయాత్రలో భక్తిపారవశ్యంతో మహిళా భక్తులు కోలాటమాడారు. చిత్తారమ్మ దేవాలయం నుంచి ప్రారంభమైన ఈ శోభయాత్రలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూకట్‌పల్లి గ్రామం ఒకప్పుడు పచ్చని పంట పొలాలతో కళకళలాడుతూ ఉండేదన్నారు. కూకట్‌పల్లిలోని అన్ని దేవాలయాలను పునర్నిర్మించి భవిష్యత్ తరాలకు ఆధ్యాత్మిక శక్తిని అందించడంలో తాను కూడా భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. 16వ తేదీన పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అమ్మవారి శోభయాత్రలో ముస్లింలు మజ్జిగ పంచిపెట్టారు.